# జాగృతి

ఉంద తామర కౌగిలిని యెడబాసి పోతూ జాలిగా చూస్తున్న సూర్యుడు ఆ కొండవెనుక దూకాడు. ఒక్క రోజు పూర్తిగా కాపురంచేసే రాత తనకు లేదన్నట్టు బుంగమూతి పెట్టుకుం దామె. సూర్యుని జాలి చూపులు ఆ ఉత్సవంలో ఉన్నవారికి బంగారు రంగుల్ని పూసి యొక వింత శోభ నిస్తున్నది. అప్పుడే వచ్చిన సూర్యారావు తన ఆలస్యానికి కారణం తలచుకొని ఒక ప్రక్క ఎత్తుగావున్న స్థలంలో నిల బడ్డాడు.

ఉత్సవం అతి వైభవంగా వుంది. ఇసుక జల్లినా క్రింద రాలనంత జనసమ్మర్దం. పల్లెటూరి యువతీ యువకుల కోలాహలం. తెల్లని స్వచ్ఛమైనవారి నవ్వు—అమాయకత్వానికీ, అనురాగానికీ ప్రతిబింబమైన వారి మోముల దరహాసం వెల్లి విరుస్తున్నది. వారి మధ్య బస్తీమూక హంసల్లో కాకుల్లా వున్నారు.

వందలకొలది ప్రభలు అతి సుందరంగా పూల కూర్పులతో, విద్యుద్దీపాలతో వారి ఆనంద తరంగ వీచికల్లో వూయల లూగుచున్నవి. రికార్డుల సంగీతం పొంగి ప్రవహిస్తున్నది. మేళ తాళాలతో ఆకాశం ప్రతిధ్వనిస్తోంది.

పల్లెటూరి ప్రజల్ని తమ నైపుణ్యంతో దిగ్భ్రమ గావించిన ఆట గుఱ్ఱాలు సేదదీర్చుకొనుటకు ఒక దరికి వచ్చినై. అదే స్థలంలో ప్రత్యేక దుస్తులు ధరించిన యువకులు పట్టాకత్తులు చేబూని సాము గరిడీలు చేస్తూ పల్నాటి యుద్ధాన్ని మైమరిపిస్తున్నారు. క్రొత్తగా పెండ్లి చేసికొని తిరునాల కొచ్చిన యువతీ యువకులు అప్పుడే పుష్పించి ఈ ప్రపంచాన్ని చూసి సిగ్గుపడుతున్న పువ్వుల్లాగున్నారు.

"సాధనం చూద్దాంరా" అని యువకుడు ఆమె చెయ్యి పట్టుకొని ముందుకు సాగాడు.

"నాకు భయం. ఆ కత్తులు వాళ్ళ చేతులనుండి జారితే మన ప్రాణా లుంటాయా?" ఆమె భర్త మాట ఖండించలేక అతి కష్టంమీద అన్నది.

అతడు పక్కున నవ్వాడు.

"ఇంత భయం మీ అవ్వకుంటే ఇంకా పదేళ్ళు బ్రతికేది. నే నుండగా నీ కెందుకు భయం పోదాం పద" అన్నాడు. ఆమె ప్రక్కనే పోతున్న బిచ్చగత్తెను పిలిచి ధర్మంకోసం మార్చు కొచ్చిన చిల్లరలో ఒక అణా ఆమె చేతిలో పెట్టి, అత్యుత్సాహంగా అతనితో కదిలిపోయింది.

ఒక ప్రక్క గారడీ విద్యలు ప్రదర్శింపబడుతున్నవి. మరో ప్రక్క పగటి వేషగాళ్ళు గజ్జెకట్టి చిందులు త్రొక్కుతున్నారు. ఆడ వేషంలో ఉన్న ఆ మగవాడిని చూసి ఆమె నవ్వుకున్నది. సూర్యారావు తన దృష్టి ని కొండవైపు సారించాడు.

ఎవరెస్టు నధిరోహించడం కూడా ఒక లెక్కేనా అన్నట్టు యువతీ యువకులు "పదండి ముందు పోదాం పోదాం పైపైకి" అన్నట్టు కొండపై కెళ్తున్నారు.

సూర్యారావుకు వాళ్ళని చూస్తుంటే చిగురించిన జీవితం వ్యర్థ మనిపించింది. అతడు ప్రతి సంవత్సరం ఈ ఉత్సవానికి వస్తాడు. దేనికోసమో వెదుకుతాడు. చివరికి స్వామిని కూడా చూడకుండా వెళ్ళిపోతాడు.

అతడు ఆజన్మ పర్యంతం బ్రహ్మచారిగా వుంటు న్నాడని తెలిసిన ప్రజలు పలు విధాలుగా అనుకున్నారు.

అతన్ని అర్థం చేసికోడానికి ప్రయత్నించినవాళ్ళు "ఆయన త్యాగ నిరతి గలవాడు" అన్నారు.

తల నెరసిన పెద్దలు "ప్రేమలోపడి పాడై పోయాడు" అని వ్యాఖ్యానించారు.

ఒకరి మంచితనాన్ని అలుసుగా తీసికొని చులకనగా మాట్లాడే కొందరు "ఆజన్మ నిరసుడట" అని కూడా అనకపోలేదు.

**శ్రీ మిక్కిలి సుందరరావు**

"లోకులు కాకులు" అనుకున్నాడు సూర్యారావు.

కొండెక్కేవాళ్ళు "ఏటి కిద్దరు, ముందుకు ముగ్గురు చేచేదుకో కోటయ్యా" అని రంకెలు వేస్తున్నారు. ఇక క్రిందికి దిగేవాళ్ళు విక్టోరియా జల పాతాన్ని తలపింపజేస్తున్నారు. ఒక్కొక్కరివద్ద బండెడు సామానుంది—బొంతరటికాయలు, బంగిన పల్లి మామిడిపళ్ళు, మొక్కు చెల్లింపగా తిరి గొచ్చిన కొబ్బరి చెంకాయలు, బెలూన్లు, టపటపా బండ్లు, చిలుకలు, చద్ది అన్నపు మూటలతోసహా యింకా ఎన్నో వున్నాయి.

ఏడు జతల ఎడ్లను బూనిన ప్రభ అప్పుడే తిరుణా లను సమీపిస్తుంది. ప్రభ సరిక్రొత్తగా వుంది. అన్ని అలంకరణలలోను క్రొత్తగా కనుపిస్తుంది. ప్రభ ముందు కట్టిన మందిరంలో ఇద్దరు నాట్య కత్తెలు "చీర కొంగు పట్టుకుంటె సిగ్గేత్తదోయ్ బావ, సిగ్గేత్తదోయ్" అని పాడుతూ నాట్యం చేస్తున్నారు.

ప్రభ వెంట గజ్జెకట్టి చిందు త్రొక్కుతున్న నలుగురు, తప్పెటలపై "జంతరి కొబ్బరి కలకండ—పైనక్క పిల్ల కుక్క పిల్ల—జంతరి కొబ్బరి కలకండ" అనే శబ్దాలు అతి నైపుణ్యంగా వాయిస్తున్నారు. వాళ్ళ కళ్ళు చింత నిప్పులవలె వున్నాయి.

ఈ ప్రభను జూచి "పుసులూరు ప్రభ, పుసులూరి ప్రభ" అని యీలలు వేస్తూ, కేరింతలు కొడుతూ అకస్మాత్తుగా పొంగిన గోదావరిలో వరదవలె వస్తున్నారు.

ఇంత జనసమ్మర్దంలో ఒక రౌడీ చెరకు గడ నములుకుంటూ వెళ్తున్న ఒక పల్లెపడుచుని జూచి "మా దేవూరు" అన్నాడు కొంటెగా—

"మాది తన్నేరు వెనకాల భద్రం" అని చెరకు పిప్పి "తూ" అని ఉమ్మి ప్రభ వైపుకు సాగిపోయింది.

వాడు నిర్ఘాంతపోయాడు.

సూర్యారావు ఆమె వేసిన ఛలోక్తిని గూర్చి ఆలోచిస్తున్నాడు. జనసమ్మర్దాన్ని చీల్చు కొచ్చిన ఒకరు సూర్యారావును కౌగిలించుకొని "బాగున్నావ బాబాయ్, ఎప్పు డొచ్చావ్" అన్నారు.

చాలా చిన్న కుఱ్ఱాడు. మారుపడి వుంటాడు. తనను చూసి వాళ్ళ బాబాయి ననుకొంటున్నాడు.

"ఎవరు బాబూ నువ్వు" సూర్యారావు అతన్ని ఎత్తుకున్నాడు.

"నా పేరు సూర్యారావు బాబాయ్"

సూర్యారావుకు ఆశ్చర్యం వేసింది.

"నీ పేరు నా పేరు ఒకటేగా—మాయమ్మ నీ పేరు నాకు పెట్టింది."

అతనికి అగమ్యగోచరంగా వుంది. కుఱ్ఱాడు వుత్సాహంగా వున్నాడు.

"బాబాయ్, మా అమ్మదిగో"

సూర్యారావు తిరిగి చూశాడు.

ఆమె నిర్మలమైన నదిలో మెల్లగా నడుస్తున్న పడవలా వస్తోంది. చెంగావి కోక కట్టుకుంది. రంగు లేని రవిక ధరించింది. కురులు జారుముడి వేసుకుంది.

ఆమె సహజ సౌందర్యం ఆభరణా లక్కర లేదంటున్నది. ఆమె చూపులు విమర్శ కందునట్లు కన్పింపవు. సూర్యారావు ఆమెను చూసి తీరని వ్యధతో గతాన్ని త్రవ్వుకున్నాడు.

★

[illegible] పదేళ్ళ క్రిందటి సంగతి.

సూర్యారావు యిల్లు ప్రతిధ్వనించేటట్లు గగ్గోలు పెడుతున్నాడు. అతని పెద్ద మేనమామ వచ్చి ఓదార్చాడు. ఏడుపు తగ్గినా ఎక్కిళ్ళు తగ్గలేదు. అతని తల్లి మరణశయ్యపై వున్నది. మేనమామ ఆమె మంచం వద్ద నిలబడ్డాడు.

"అన్నయ్యా! సమయానికి వచ్చావు. నా బాబుని తీసుకెళ్ళి నీ బాబుగా చూసుకో"

"అదేమిటి చెల్లీ!"

"అన్నయ్యా, నీ కంతా తెలిసిందేగా. ఆయన రాచకీయాల్లో దిగి నన్ను కూడా మరచిపోయాడు. దేశసేవలో మునిగి ఐదువేల బాకీ బాబు నెత్తిన రుద్దిపోయాడు. అది తీర్చుకునేసరికి నా జీవితం తెల్లవారింది. ఇక మిగిలింది ఈ యిల్లు. దీనిని కూడా బాబు కివ్వ దలుచుకోలేదు. లక్ష్మి మా సుఖంకోసం తన జీవితమంతా ధారపోసింది. ఆమెకు మే మెంతో

# మాయం కొంగ



ఫోటో: శ్రీ ఎన్. గిరిధర్

ఋణపడివున్నాం. ఇటువంటి పనిమనిషి ప్రపంచంలో కన్పించ దన్నయ్యా'' అన్నది ఆమె ఆయాసంతో.

''అమ్మగారూ, మీరు అధైర్య పడకండి. నా వూపిరితీసి మీకు ప్రాణం పోస్తాను'' అన్నది లక్ష్మి.

''పోసినంత కాలం పోశావు. ఇంకేం పోస్తావు. ఈ యిల్లు నీవు తీసికో లక్ష్మి. నీకు ఒక కూతురు వున్నది. ఆమెకు ఈ యింట్లో పెండ్లిచేసి కలకాలం యీ యిల్లు కళ కళ లాడేట్లు చెయ్యి'' అన్న తరువాత ఆయాసంతో చాలసేపు బాధపడి ''అన్నయ్యా, నా బాబు తండ్రిలేనివాడే కాక తల్లిలేని వాడు కూడా—'' అంటూ కన్ను మూసింది.

సూర్యారావు తెనాలి విడిచాడు. మేనమామతో పాటు మద్రాసు చేరుకున్నాడు. కొన్ని నెలలకు......

సూర్యారావు అత్త సూరమ్మ అతన్ని ఆ యింట్లో పనిమనిషిగా మార్చింది. ఆ యింట్లో ఏ వస్తువు పోయినా తనే ముద్దాయి! ఏ వస్తువు పోకుండ కాపలా కాయాలి! ఇన్నీ చేస్తూ తను చదువుకోవాలి.

ఆ యింట్లో వాళ్ళందరూ విచిత్రమైన మనుష్యులు.

సూరమ్మ అందమైన మనిషి. కాని మేడిపండు!. ఆమెలో క్రోధం, ఈర్ష్య, జుగుప్స గూళ్ళు కట్టుకున్నాయి. బాగుపడేవారిని చెడగొట్టడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. ఆమె కూతురు కమల తప్ప ఆ యింట్లో వాళ్ళందరూ ఆమె చేతిలో కీలుబొమ్మలు. కమల చిన్న పిల్ల. ముద్ద బంతి పూవులా వుంటుంది. సూర్యారావుతో సన్నిహితం. బావకు ఆకలిలేని రోజు మన యింట్లో పొయ్యి రాజకోనక్కరలేదంటుంది. సూర్యారావు పెద్ద మేనమామకు ఇంట్లో విషయాలు బొత్తిగా పట్టవు. అందరూ మంచివాళ్ళనుకునే రకం!

అతని చిన్న మేనమామ వారింట్లో వుండి కాలేజిలో చదువుకుంటున్నాడు. మానవులకు అభ్యుదయ భావాలు కావాలి అని పదే పదే అంటూ వుంటాడు. చలం సాహిత్యం గొప్పదని అతని నమ్మకం. ఒకనాడు—

సూర్యారావు మార్కెట్టుకు వెళ్ళి కూరగాయలు కొని సంచిలో వేసికొన్నాడు. కమల తెచ్చిపెట్టమని బతిమాలిన మల్లెపూలు పొట్లం జేబులో వేసికొన్నాడు.

ఇంట్లో ప్రవేశించాడు. ఎవరూ వున్నట్టులేదు. ప్రక్క బెడ్‌రూమ్ వైపు తను అనుకోకుండా చూచాడు. తలుపులు వేసివున్నాయి. కాని ఆ కిటికీలో నుండి కనిపించిన దృశ్యం తన హృదయాన్ని భగ్నం చేసింది.

తన చిన్న మేనమామ సూరమ్మ కౌగిటిలో వున్నాడు!

తనకు ''ఛీ'' అనిపించింది. ఇటువంటి వాళ్ళేనా అభ్యుదయాన్ని కోరేది.

తనకు వాళ్ళను కత్తితో పొడిచివెయ్యాలని పించింది.

ఏదో అన్యాయం చేస్తున్నా రనిపించింది. లోక విరుద్ధమయిన విషసర్పాలు యీ యింట్లో కాపురం చేస్తున్నవి. పాపభీతిలేని అవినీతి యిక్కడ బుసలు కొడ్తున్నది. కామం, దుర్మార్గం, అధర్మం యిక్కడ మసల గ్రాగుతుంది అనుకున్నాడు.

కొంతసేపటికి తలుపు తెరచుకుంది.

చిన్న మేనమామ బయటికి వచ్చాడు. తన ముఖం చూడలేకపోయాడు. పాప పంకిలమైన ఆ యింట్లో తన లేత హృదయం నిలువలేకపోయింది. అందుకు తను ఆ వూరినే విడిచిపెట్టవలసి వచ్చింది.

చీకట్లో రైలు ఈదుకుంటూ వెళ్తుంది.

సూర్యారావు తెనాలి స్టేషనులో బండి దిగాడు. తను యింటివైపు దారితీశాడు. దారి పొడుగునా చిన్న చిన్న దుకాణా లున్నాయి. ఆకలి బాగా దహిస్తోంది. చిల్లర డబ్బులతో ఏమైనా కొనుక్కుందామని అటు యిటూ చూశాడు ఒక చిన్న దుకాణం వద్దకెళ్ళి.

''సవాపావు పకోడీ లివ్వండి'' అని పావులా చేతిలో పెడూ ఆశ్చర్యపోయాడు.

''సుబ్బులూ—నేను'' అన్నాడు.

సుబ్బులు అప్పుడే పరిమళిస్తున్న గులాబీ మొగ్గలాగుంది. సంధ్య కిరణాలను ధిక్కరించే ఛాయ. దరహాసం వెల్లివిరిసే మోము. అర్ధచంద్రాకృతిని బోలు నుదురు.

చంద్ర బింబానికి మెరుగులు దిద్దుతూ, తీరిక సమయంలో ఏకులు వడుకుతున్న అవ్వ యీమె నుదుట కుంకుమ రేఖయై వెలసినట్లుంది. ఆమె మెలికలు తిరిగిన కురులు సముద్రం ప్రశాంతంగా వున్నప్పుడు నిబ్బరంగా కదిలే అలలవలె ఉన్నవి.

''ఎవరండీ'' అని పరికించి చూసిం దామె.

''నేను సుబ్బులూ—బాబుని'' అన్నాడు సూర్యారావు.

''సూర్యారావుగారా'' అని తలెత్తింది.

ఎన్నాళ్ళకు చూశాను అనుకునే భావంతో, చిన్ననాటి సంఘటనల కోసం అతని మోములో గుర్తులు వెదకబోయేసరికి సిగ్గు సింగారమై రాగా కన్నులు క్రిందికి వ్రాలి అతని పాదాన్ని చూసి చల్లని తుషార

## నిద్ర మంపరం

రైల్లో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్న ఒక ఆసామీ నిద్రపోతూ ఉండగా టికెట్ కలెక్టరు వచ్చి టికెట్ అడుగగా అతడొకకన్ను తెరచి తిరిగి మూసుకున్నాడు.

"టికెట్ ఏదయ్యా?" అన్నాడు తిరిగి టికెట్ కలెక్టర్.

ప్రయాణికుడు ఆవలించాడొకసారి.

"నీ దగ్గర టికెట్ లేకపోతే డబ్బు యిచ్చుకోవాలి. అయిదూ ఆరు రానియ్!"

ప్రయాణికుడు మాట్లాడలేదు.

"అయిదూ ఆరు" అన్నాడు తిరిగి టికెట్ కలెక్టరు.

కొంతసేపటికి ప్రయాణికుడు మెల్లగా కళ్లు విప్పుతూ "పద కొండు" అన్నాడు.

బిందువులు కురిపింపజేసి తమ కర్తవ్యాన్ని నెరవేర్చుకున్నాయి.

"ఈవేళ మాయింటికి రావాలి" అన్నది ఆమె తల వంచుకుని.

"అసలు మీ యింటివద్ద ఉండటానికే వచ్చాను"

"అంత భాగ్యమా? మా జన్మ తరించదూ?" ఆమె కెక్కడలేని సంతోషం వచ్చింది.

ఇద్దరూ కొంత దూరం మౌనంగా నడిచారు.

"ఇదేమిటి ఇలా దారితీస్తున్నావ్?" అన్నాడు సూర్యారావు.

"మేము మీ ఇంట్లో వుండుటలేదు."

"ఎందుకని?"

"ఏమో నాకు తెలియదు. మా యమ్మను నే నెప్పుడూ అడుగలేదు."

వీళ్ళు నిరుపేదలు. తమ ఇంటిని లక్ష్మమ్మ అమ్ముకొని వుంటుందని తను వూహించాడు. తన తల్లి చెప్పిన మాటను వాళ్లు వమ్ము చేశారని కొంచెం కించపడ్డాడు సూర్యారావు.

కొంత దూరం నడిచాక సుబ్బులు ఒక ఇంటి ముందు ఆగింది. లక్ష్మమ్మ అతన్ని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించింది.

వారి పూరిగుడిసె పరిశుభ్రంగా ఉంది. సామానులన్నీ చక్కగా వాటి నియమిత స్థలాల్లో వున్నాయి. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే ఆ ఇల్లు వేసవి విడిది భవనాల మరిపించగలదు.

"లక్ష్మమ్మ! మీరు మన ఇంట్లో వుండడం లేదా?" అని ప్రశ్నించాడు.

"అదే మనవి చేయబోతున్నాను. ఈ వూరిలో కాలేజీ పెట్టాక ఇళ్లకు బాగా అద్దె లొస్తున్నాయి. తమ ఇల్లు అద్దె కిచ్చాను. ఆ డబ్బు తమ పేర బ్యాంకిలో వేస్తున్నాను."

అతనికి తన తల్లి మరణ శయ్యపై నున్నప్పుడు లక్ష్మమ్మని గూర్చి చెప్పిన మాటలు జ్ఞప్తి కొచ్చాయి.

"ఆ సొమ్ము మీది. ఆ ఇల్లు మా అమ్మ మీ పేర వ్రాసి ఇచ్చింది. నాకు అన్నీ తెలుసు" అన్నాడు సూర్యారావు.

"గొప్పోరిల్లు మా కెందుకు బాబూ. అమ్మగారి తృప్తికోసం నా పేర వ్రాయించుకున్నాను. కాని ఇప్పుడు మీ పేర తప్పక వ్రాస్తాను."

"అమ్మా, వేన్నీళ్లు బయట పెట్టాను. వారిని స్నానానికి వెళ్లమను" అన్నది సుబ్బులు.

సూర్యారావు స్నానంచేసి భోజనానికి కూర్చున్నాడు.

"అమ్మా మల్లెపూ లెక్కడివి? వాసన కొడుతుంది" సూర్యారావుకు భోజనం వడ్డిస్తూ సుబ్బులు అన్నది.

అప్పుడు సూర్యారావుకు తను కమలకోసం తెచ్చిన పూలు గుర్తుకొచ్చాయి. ఆ పొట్లం తన జేబులోనే వున్న సంగతి తనకే తెలియదు.

"ఇదిగో మల్లెపూలు. నేను తెచ్చాను సుబ్బులూ" అని పొట్లం తీసి సుబ్బులు కివ్వబోయాడు.

సుబ్బులు మల్లెపూలు తీసుకోడానికి బహు సిగ్గుపడ్డది.

"ఫరవాలేదు. తీసుకో సుబ్బులూ" అన్నా డతను.

"తీసుకోమ్మా" అని "దాని కెందుకు బాబూ మల్లెపూలు తెచ్చారు?" అన్నది లక్ష్మమ్మ.

సుబ్బులు మల్లెపూలు తీసుకొన్నది.

మరునటి దినం తనను స్కూల్లో చేరమని లక్ష్మమ్మ పంపింది. కొన్ని సంవత్సరాల తరువాత—

తను కాలేజీ చదువు ముగించుకొని ఉద్యోగంలో చేరాడు.

లక్ష్మమ్మ తన జీవయాత్ర ముగించుకొని స్వర్గానికి వెళ్లింది.

తమ ఇంట్లో తను ఒక్కడే వుంటున్నాడు. సుబ్బులు వచ్చి వంట పనితోసహా అన్నీ చేసి పోతున్నది.

రోజూ సుబ్బులు ఇలా వచ్చి ఏవేవో మాట్లాడి పోయేది. తను ఆమెను అడ్డు ప్రశ్నలు వేసి తికమక పెట్టేవాడు. ఆమె అటువంటి ప్రశ్నలకు సిగ్గుపడి లేడి పిల్లలా బెదరిపోయేది. అతి అమాయకంగా తెల్లని స్వచ్ఛందమైన నవ్వు ఆమె పెదవులపై నాట్యం చేసేది. ఆ నవ్వులో తన నవ్వు ఏకమై చల్లని పిల్ల తెమ్మెరల్లో కలిసి ఎప్పటికో ప్రయాణం చేసేది.

చెప్పరాని మధుర స్మృతులుగా, విప్పరాని అనుభూతులుగా వారి హృదయాల్లో నాటుకొనిపోయాయి.

ఆ పేటలో వాళ్లంతా అనుమానిస్తున్నారని తనకు తెలుసు. అదే సుబ్బులు మెడలో గొలుసుగా మారాలని సూర్యారావు ఆశ!

ఆనాడు—

సూర్యారావు బెడ్‌రూమ్‌లో పడుకొని 'మాలపల్లి' చదువుకుంటున్నాడు. సుబ్బులు తన తలగడ వద్ద తల వంచుకొని, నిలబడి వుంది. బెదరిపోయి గాలికంటె తేలిగ్గా పరుగెత్తే సుబ్బులు—ఎన్నడూ అతని ఎదుట నిబ్బరంగా క్షణం నిలువని సుబ్బులు—పూర్తిగా సమాధానం చెప్పకుండా పరుగెత్తే సుబ్బులు వేళకాని వేళలో ఇలా వచ్చి నిర్భయంగా నిలవడం అతని కాశ్చర్యం వేసింది.

సూర్యారావు బెడ్‌మీదనుండి లేచాడు.

"ఏమిటి సుబ్బులూ" అన్నాడు నిదానంగా.

సుబ్బులు సమాధానం చెప్పలేదు. రంగులు పోసి వంపులు త్రిప్పిన బంగారు విగ్రహంలా వుంది. అతను ఆమె దగ్గరకు వెళ్లి మోము పైకెత్తి "చెప్పకూడదా?" అన్నట్లు కళ్లతో ప్రశ్నించాడు.

ఆమె కళ్లు అశ్రుపూరితాలై వున్నాయి. ఎర్రని చెక్కిళ్లు ఎరుపెక్కాయి.

"క్షమించండి. ఇక మీ వద్దకు రాలేను" అని ఆమె అతి కష్టంమీద అన్నది.

అప్పటి ఆమె మోము చూచి తన హృదయం కరగిపోయింది.

"నీవు రాకపోతే నేను ఏకాకిలా ఎక్కడికో పోతాను. నాకు నీవు లేనిదే ఈ ప్రపంచమే లేదు సుబ్బులూ."

"మా పేటలోవాళ్లు నా గురించి నోరు పట్టని మాట అంటున్నారు. రౌడీ వెధవలు నా మచ్చ మాపుతారట. నా నుండి మా యమ్మకు పాపం అంటగట్టుతున్నారు."

"ఇదంతా నాకు తెలుసు. అందుకే నేను త్వరపడుతున్నాను. మన పెండ్లికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాను. సుబ్బులూ, ఇక పది రోజుల్లో మన వివాహం తప్పక జరుగుతుంది."

ఆమె కన్నుల నుండి రెండు అశ్రువులు చెక్కిళ్లపై ముత్యాల్లా నిలిచాయి. వాటిని తన చూపుడు వ్రేలితో అద్దాడు.

"నిన్ను అర్థం చేసుకోడానికి ఇంత కాలం పట్టింది. ఇలా చెయ్యడానికి కూడా కొన్ని కారణాలున్నాయి" అన్నాడు.

మరునటి రోజు—

శుక్రవారం. సుబ్బులు తలంటి స్నానం చేసింది. మల్లు కోక కట్టుకుంది. నల్ల రవికె తొడుక్కుంది. మల్లెపూలు పెట్టుకుంది.

బ్రహ్మరథంలా నడిచి వచ్చి వరండాలో నిలుచుంది.

సూర్యారావుకు ఇల్లంతా ప్రకాశించిన ట్లుంది.

"మహా శివరాత్రికి కొండకు వెళ్తాను. తమరు సెలవు దయచేస్తే—" అందామె.

(మిగతా 62 వ పేజీలో)

# జాగృతి

[16 వ పేజీ తరువాయి]

"ఏం, తప్పకుండా వెళ్ళాలా?"

"స్వామికి మొక్కుబడి తీర్చాలి. మా పేటలో చాలమంది వెళ్తున్నారు. వారితో కలిసి వెళ్తాను."

సూర్యారావు జవాబు చెప్పలేదు.

"మీకు కష్టంగా వుందా?"

"అట్టే ఏమీ లేదు. ఇక నా కళ్ళలా ఆ కొండ పైపు చూస్తుంటాయి."

"అయితే మీరు రాకూడదా?"

"అది కాదు. ఆఫీసరు గారు వూళ్ళో లేరు. ఆఫీసు బాధ్యత నామీద వుంది. నేను కూడా సెలవు పెడితే ఆయన కష్టపడతారు. వచ్చే ఏడు ఇద్దరం కలిసి వెళ్దాం. అలా వచ్చేటట్లు చెయ్యమని ఈ ఏటికి ప్రార్థించిరా" అన్నాడు సూర్యారావు. అంతే—

ఆమె మళ్ళీ తిరిగి రాలేదు.

సూర్యారావు ఆ పేటలోని వాళ్ళను అడిగాడు. తమకు కన్పించలేదన్నారు. అతని దారుణమైన దుఃఖం చూసి వాళ్ళు భయపడ్డారు. అతడు పిచ్చివాడుగా మారిపోయాడని అనుకున్నారు. నిజంగా అతడు కొన్నాళ్ళు గంగవెర్రులెత్తి తిరిగింది మాత్రం నిజం.

ఆ పేటలోని కొందరు ఆమెను హత్య చేసినట్లు అతను కలగన్నాడు.

తరువాత అతను ఆత్మహత్యా ప్రయత్నంలో వుండగా సమయానికి కమల వచ్చి రక్షించింది. అతను ఆత్మహత్య చేసుకుంటే నశించిపోతాడు. అతని శరీరంతోపాటు ఆ ప్రేమ కూడా నశిస్తుంది. ఆమె యెడల అతని ప్రేమ వుండాలంటే బ్రతికే వుండాలి. అందుకే అతను బ్రతికాడేమో!

ఆ సమయంలో కమల అతనివద్ద చాలాకాలం వుంది. ఆమె చేసిన సేవను అతను మరిచిపోలేదు.

ఆమె అతనిని ప్రేమించినదని తెలిసికొని, సూర్యారావు జాలిపడ్డాడు. అగ్ని పర్వతాన్ని లోపల దాచుకొని బయటికి నవ్వే నేటి కాలపు నాగరికత విలువ ఎంత? అందుచేతనే అతను కొత్త జీవితం ప్రారంభించలేకపోయాడు.

అతనిలో నిరంతరాందోళనం కలుగుతుంది. గతాన్ని తలుచుకుంటే ఎన్నో మధుర స్మృతులు . . . వాటి వలన తనివి తీరని దుఃఖం! సముద్రం పొంగినట్లు గుండెను చీల్చుకొని వచ్చే క్షోభ! ఆ క్షోభలోనే ఉన్నది అతనికి కావలసినంత సుఖం!

*

"నాన్నాయ్, అమ్మ పిలుస్తుంది" అన్నాడు అతని కౌగిట్లో వున్న చిన్న సూర్యారావు!

సూర్యారావు కమలను చూసి నిర్ఘాంతపోయాడు. అతని హృదయం వ్యథతో కృంగిపోయింది.

పాపం! ఎంత త్వరగా ఆమె గాజులు రాలిపోయాయి! జీవితంలో అడుగు పెడుతూనే మాంగల్యాన్ని కోల్పోయింది.

కొంతసేపు నిశ్శబ్దంగా గడిచింది.

"మా వూరు వెళ్దాం రండి" అని ఆమె అన్నది.

"నాన్నాయ్, నీవు మాతో రావాలి" అని పట్టు బట్టాడు చిన్న సూర్యారావు.

సూర్యారావు కమల ఇంటికి దారి తీశాడు.

కమలకు వున్న ఆస్తి అంతా ఒక్క చిన్న సూర్యారావే! ఆమె కుమారుని పైకి తీసుకురావాలి. కనీసం ఆమాత్రం సహాయం చెయ్యగలిగితే, అదే ఆమె జీవితాని కొక వెలుగు బాట—ఒక పూలతోట—

ఆ రాత్రంతా సూర్యారావుకు నిద్ర పట్టలేదు. కమల కూడా తన బిడ్డను ఒళ్ళో పెట్టుకుని పడుకుంది. కాని ఆమెకు తన భవిష్యత్తు ఒక గాఢాంధకారంలా కనుపించసాగింది.

సూర్యారావు తను ఉద్యోగం చేసి బ్యాంకులో వేసుకున్న 25 వేల రూపాయలు కనీసం పిల్లవాని కొరకైనా ఉపయోగపడితే తన బాధ్యత కొంత తగ్గిపోతుం దనుకున్నాడు.

అంతకంటే అతడు చెయ్యగలిగింది లేదేమో!

ఎడబాటు సహించలేని కమల మిత్రుడు వడిగా వచ్చాడు. రాత్రి అంతా నిట్టూర్పులు విడిచిన సుదతి కమలం నవ్వుకుంది.

సూర్యారావు తన డబ్బును చిన్న సూర్యారావు శ్రేయస్సుకు ఉపయోగించాలని నిశ్చయించుకుని అక్కడనుండి బయలుదేరి వెళ్ళాడు.

# ప్రయాణంలో ప్రణయం

(10 వ పేజీ తరువాయి)

లేదు. పోనీ నేనే ఒక అవకాశం కల్పించుకుంటే. అవును ఏమయినాసరే తన బ్యాగ్‌లోని "చిత్రసీమ"ను అందించాల్సిందే" ఒక నిశ్చయాని కొచ్చాడు శంకర్.

రానే వచ్చింది అవకాశం. ఆ అమ్మాయి "సినిమా రంగం" పుస్తకం చూసిన తరువాత మూయబోతూంది. శంకర్ రక్తం పొంగింది. ఇదే సమయం. తన దగ్గరవున్న "చిత్రసీమ" పుస్తకాన్ని ఆమెకు అందివ్వాలి. ధైర్యం చేశాడు. బ్యాగ్‌లోని పుస్తకం "చిత్రసీమ" బయటకు తీసి ఆ అమ్మాయికి చిరునవ్వుతో అందివ్వబోయాడు. తన ప్రక్క గూడు మీద ఎవరో పొడిచినట్లయింది. "రద్దీలో ఎవరి చెయ్యో తగిలివుంటుంది" అనుకుని మళ్ళీ ఆ పుస్తకాన్ని ఆమె దగ్గరకు తీసుకొచ్చి అందియ్యబోయాడు. ఆమె బిత్తరపోయింది. తన్ను తాను అరికట్టుకోలేక పోయాడు శంకర్. "ఏం! సిగ్గు పడతా వెందుకు? తీసుకో. నేను కొత్తవాణ్ణి అని ఆలోచిస్తున్నావా ఏం! తీసుకో" తియ్యగా ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు శంకర్. ఆ అమ్మాయి భయంతో వణికిపోయి మరీ వెనక్కుపోయింది.

అంతే! "ఫట్, ఫట్" మని రెండు చెంపలూ మ్రోగించా రెవరో, నిశ్చేష్టుడై, ఎవరా తనను కొట్టింది అని ప్రక్కకు తిరిగాడు. మళ్ళీ "ఫట్" మని చెంపమీద నిమురుగా తగిలింది. శంకర్ కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎదురుగా చింత నిప్పులవంటి కళ్ళతో, యముడిలాగ నుంచొని వున్నాడు ఆ తలగుడ్డవాడు. "ఓరి, వెధవా! పరాయి ఆడదానితో సరాచికాలాడతావ్రా నువ్వు. నీ వొళ్ళు చీలుస్తా నుండు" అని బాంబు బ్రద్దలయినట్లు అరిచి శంకర్‌ను లాంచి వీపుమీద తన సత్తువకొద్దీ రెండు గుద్దులు గుద్దాడు ఆ తలగుడ్డవాడు. శంకర్‌కి నడుం విరిగిపోయినట్లయింది. "అయ్యో, బాబోయ్" అని కెవ్వున కేకేశాడు, పెట్టెలో వాళ్ళంతా గుమిగూడారు అక్కడ. ఎవరో ఇద్దరు పుణ్యాత్ములు ఆ తలగుడ్డవాణ్ణి పట్టుకున్నారు. "వదలండి వీడి పని పడతా" అంటున్నాడు తలగుడ్డ మనిషి.

అప్పుడే రైలు ఒక స్టేషన్లో ఆగింది.

"హోరి భగవంతుడా! బాగా తప్పే కన్ను లొట్ట పోయింది." అనుకుంటూ క్రిందపడ్డ సంచిని, సంకెన వున్న ఉత్తరీయాన్ని తీసుకుని శంకర్ ఆ పెట్టెలోంచి బయటపడ్డాడు. లోపలనుంచి ఒకావిడ గొంతు వినపడ్డది. "ఓరి వీడి మదం మండా! ఆడ కూతురంటే అంత చులకనా! అందులో పెనిమిటి ప్రక్కన వుండగానేనా! తగిన శాస్తి అయింది ముదనష్టపు పీడకి"

"దేవుడా" అంటూ సెకండ్ క్లాస్‌లో ఒక మూల కెక్కి కూర్చున్నాడు శంకర్ దిక్కు మోహంతో.

"ఏమిటి! ఆ తలగుడ్డవాడు ఆ అమ్మాయి మొగుడన్నమాట. అయితే మరి, ఆ అమ్మాయి విసిరిన చిరునవ్వులన్నీ వాడిని చూసే అన్నమాట! మరి ఆ అమ్మాయి తనవంక చూసిన చూపుల కర్థమేమిటి? అందుకనేగా తను ధైర్యంచేసి పుస్తకమందివ్వబోయింది. అమ్మాయి మరి ఎందుకు వణికి పోయింది భయంతో?" వేగంగా పని చెయ్యడం మొదలెట్టింది శంకర్ బుర్ర. "ఆ! అర్థమయింది. ఇంతకీ ఈ అనర్థానికి కారణం ఆ అమ్మాయి మెల్ల కళ్ళు. అసలు ఆ అమ్మాయి చూపులూ, చిరునవ్వులూ ఆ తలగుడ్డవాడిమీదే అన్నమాట. ఎంత అపోహ పడ్డాను. హోరి దేవుడా" అర్థం చేసుకున్నాడు.

హడావుడిలో తన రెండు పుస్తకాలు వదిలేశాడు ఆ పెట్టెలో. "పోతే పోయినయ్ లే, బ్రతికివుంటే బలుసాకు తినవచ్చు" అని సమాధాన పడ్డాడు.

ఆ దృశ్యం, ఆ భయానక దృశ్యం శంకర్ కళ్ళకు కన్పించింది. పుస్తకం అందివ్వబోవటమూ, ఆ అమ్మాయి భయంతో వెనక్కుపోవడం, వాడు, వాడే ఆ తలగుడ్డవాడు తన వళ్ళు హూనం చేయడం, "అబ్బా" అని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు హీరో శంకర్.

రైలు "కూ" అని కూసి మళ్ళీ బరువుగా బయలుదేరింది.